సమాచారం

ఒకరికి కొవిడ్ పాజిటివ్

గచ్చిబౌలి: కొండాపూర్ ఏరియా జిల్లా ఆస్పత్రిలో నిర్వహించిన కొవిడ్ టెస్ట్‌లలో ఒకరికి పాజిటివ్‌గా నిర్ధారణ అయిందని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వరదాచారి తెలిపారు. మంగళవారం 29 మందికి కొవిడ్ టెస్టులు చేశారు. ఐదుగురికి ఆర్టీపీసీఆర్, 21 మందికి రాపిడ్ యాంటిజెన్ టెస్ట్‌లు చేశారు. రాపిడ్ యాంటిజెన్ టెస్ట్‌లలో ఒకరికి పాజిటివ్‌గా తేలిందన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 15, పచ్చిమిర్చి 40–50, బెండ 45, కాకర 50, దొండ 30, దోస 40, ఆలు 25, చామ 70, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 70, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 30, చిక్కుడు 60, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (3) 10, క్యాలీఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 140, వెల్లుల్లి 100.

క్లుప్తంగా

దివ్యాంగ విద్యార్థికి వాహనం అందజేత

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో డాక్టోరల్ పరిశోధక విద్యార్థి హర్ష్‌రాజ్‌కు త్రీవీలర్‌ను మంగళవారం డిఫరెంట్లీ ఏబుల్డ్ పర్సన్స్(ఈసీడీఏపీ) ఎంపవర్డ్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ రామస్వామి అందించారు. ఈసీడీఏపీ అనేది హెచ్‌సీయూలో దివ్యాంగ విద్యార్థులు, సిబ్బంది యొక్క ప్రత్యేక అవసరాలను తీర్చేందుకు ఏర్పాటు చేసిన విభాగం. ఇప్పటికే మూడు చక్రాల స్కూటర్, బ్యాటరీ వీల్‌చైర్‌ను కొనుగోలు చేసింది. ఈ వాహనాలు క్యాంపస్‌లో లోకో మోటర్ వైకల్యాలున్న విద్యార్థులకు అందజేస్తారు .

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

పటాన్‌చెరు టౌన్: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో.. బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎమ్మెల్యే సోదరుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేట గ్రామంలో స్థానికుడు మల్లేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, వైస్ ఎంపీపీ సునీతాసత్యనారాయణ, నాయకులు పోచారం కిష్టయ్య, నర్సింగరావు, ఖాజా, శివ, మాణిక్ పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి కృషి

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డివిజన్‌ను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని పలుచోట్ల సోమవారం రాత్రి అంబేడ్కర్ విగ్రహం, ప్రధాన ముఖద్వారం వద్ద, సింఫనీ పార్క్‌హోమ్స్ కాలనీ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన నూతన ఐమాక్స్ లైట్లను ప్రారంభించారు.శ్రీరామ్‌నగర్ కాలనీలో దుర్గామాత ఆలయం వద్ద లైటింగ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, మాజీ వార్డుకమిటీ సభ్యుడు కొండల్, శ్రీరామ్‌నగర్ కాలనీవాసులు పాల్గొన్నారు.

రంజాన్ కానుకలు పంపిణీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు) మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్ పరిధిలోని ముస్లింలకు రంజాన్ కానుకలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లు పుష్పనగేశ్, సింధు ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ అంజయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఐలేష్, నాయకులు పరమేశ్‌యాదవ్, దేవేందర్‌చారి పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో అయ్యప్పస్వామి ఆలయం 15వ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్‌విజయ్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు నర్ర భిక్షపతి, సంజీవరెడ్డి ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ చైర్మన్‌ను సన్మానించారు.

సమస్యల పరిష్కారానికే ‘ముఖాముఖి’

పటాన్‌చెరు టౌన్: జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజలతో ముఖాముఖి కార్యక్రమాన్ని చేపట్టిందని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని సింఫనీపార్క్ హోమ్స్‌కాలనీలో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రతను పాటించాలని సూచించారు. డిప్యూటీ కమిషనర్ బాలయ్య మాట్లాడుతూ కాలనీవాసులు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ సూపర్‌వైజర్ వెంకటేశ్, డీఈ క్రాంతి, ఏఈ శివకుమార్, హెచ్ఎండబ్ల్యూఎస్ ఏఈ ప్రవీణ్, జీహెచ్‌ఎంసీ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అడుగులు



నల్లగండ్ల హుడా కాలనీలో జరుగుతున్న థీమ్ పార్కు పనులు



సీసీ రోడ్ల నిర్మాణం

- నల్లగండ్ల హుడా కాలనీకి నిధుల వరద
- యుద్ధప్రాతిపదికన పనులు

శేరిలింగంపల్లి: అభివృద్ధిలో నల్లగండ్ల హుడా కాలనీ ముందడుగు వేస్తోంది. ఎమ్మెల్యే గాంధీ భారీగా నిధులు మంజూరు చేయడంతో పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా మౌలిక వసతుల కోసం ఎదురుచూస్తున్న కాలనీవాసులకు సౌకర్యాలు కలుగుతున్నాయి. డ్రైనేజీ సమస్య పరిష్కారం, సబ్‌స్టేషన్ వంటివి అందుబాటులోకి రావడంతో బాటు పలు పనులు కొనసాగుతున్నాయి. శేరిలింగంపల్లి సర్కిల్‌లోని గచ్చిబౌలి డివిజన్ నల్లగండ్ల హుడా కాలనీకి 33 ఏళ్ల చరిత్ర ఉంది.1990 సంవత్సరంలో హుడా కాలనీ ఏర్పాటైంది. ఈ కాలనీ 360 ఎకరాల విస్తీర్ణం కలిగి ఉండగా, ప్లాట్లుగా విభజించారు.

చేపట్టిన అభివృద్ధి పనులు ఇవే...

- రూ.12 కోట్లతో నల్లగండ్ల హుడా కాలనీలో సబ్‌స్టేషన్ నిర్మాణం
- రూ.5 కోట్లతో విశ్వామిత్ర, భగీరథ పార్కులు అభివృద్ధి
- రూ.4 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు.. హుడా కాలనీలోని రవీందర్‌రెడ్డి ఫంక్షన్ హాల్ నుంచి హిమసాయి లేక్ వ్యూ వరకు 600 డయాతో మెయిన్‌లైన్ నిర్మించారు. సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు అనుసంధానించేందుకు లైన్ ఏర్పాటు.
- రూ.2 కోట్లతో అంతర్గత రోడ్లలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణం. అంతర్గత రోడ్ల అభివృద్ధికి చర్యలు
- ఎలిగెంట్ పార్కు, ఆక్సిజన్, అంబేడ్కర్, నక్షత్ర, వ్యాస, గాంధీ పార్కులను అభివృద్ధి చేశారు
- కాలనీలో 8 కిలోమీటర్ల బీటీ, 2 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మాణం
- కాలనీలో 110 ఎలక్ట్రికల్ పోల్స్, 625 స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేశారు.
- రూ.4 కోట్లతో నల్లగండ్ల హుడా కాలనీలోని రవీందర్‌రెడ్డి గార్డెన్ నుంచి హిమసాయి లేక్ వ్యూ వరకున్న డబుల్‌రోడ్డు అభివృద్ధికి ఎస్‌ఆర్‌డీపీ కింద ప్రతిపాదనలు పంపారు.

నానక్‌రాంగూడలో ప్రజాయాత్ర



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకులు రవికుమార్‌యాదవ్, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గడపగడపకూ బీజేపీ ప్రజాయాత్ర కార్యక్రమానికి అడుగడుగునా జనం నీరాజనం పడుతున్నారు. 15వ రోజైన మంగళవారం సాయంత్రం నానక్‌రాంగూడలో స్థానిక నేతలు, ప్రజలతో కలిసి బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాక్షస పాలన చేస్తోందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారన్నారు. ప్రధాని మోడీ ఉచిత రేషన్, ఆయుష్మాన్‌భారత్ తదితర కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా, డివిజన్ నాయకులు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

అపార్ట్‌మెంట్లలో సీపీఆర్‌పై శిక్షణ

సాక్షి, సిటీబ్యూరో: గుండెపోటు, ఇతరత్రా అత్యవసర స్థితిలో ప్రాణాలు కాపాడేందుకు ఉపయోగించే కార్డియోపల్మనరీ రెస్యూసిటేషన్ (సీపీఆర్) ప్రథమ చికిత్సపై నివాసిత సంఘాలలో శిక్షణ ఇవ్వనున్నారు. ఇందులో భాగంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ (ఐఆర్‌సీఎస్) ఆధ్వర్యంలో మంగళవారం గచ్చిబౌలిలోని ప్రెస్టీజ్ హైఫీల్డ్స్‌లో అవగాహన కార్యక్రమం జరిగింది. డాక్టర్ విజయ్ భాస్కర్, రియాజుద్దీన్, ఇతర సాంకేతిక సిబ్బంది సీపీఆర్ ప్రాముఖ్యత, అత్యవసర వైద్య పరిస్థితికి ఎలా స్పందించాలి? ప్రాథమిక చికిత్స పద్ధతులను వివరించారు. ఐఆర్‌సీఎస్ భవిష్యత్తులో సీపీఆర్‌పై ఎంపిక చేసిన సభ్యులకు



సర్టిఫికెట్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని ఐఆర్‌సీఎస్ చైర్మన్ భీమ్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో అమృత ఫౌండేషన్ డైరెక్టర్ డా.దేవికారాణి, ప్రెస్టీజ్ మేనేజ్‌మెంట్ పాల్గొన్నారు.

సమస్యలు లేని ప్రాంతంగా తీర్చిదిద్దాలి

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌ను సమస్యలు లేని ప్రాంతంగా మార్చడంలో అధికారులు కృషి చేయాలని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి సూచించారు. 100 రోజుల కార్యక్రమాన్ని పురస్కరించుకొని జలమండలి, జీహెచ్‌ఎంసీ, ఎంటమాలజీ, శానిటేషన్, ఆరోగ్యశాఖ, విద్యుత్, యూబీడీ విభాగాల అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. గుల్‌మొహర్‌పార్కు, డాక్టర్స్‌కాలనీ, లక్ష్మీ విహార్‌ఫేజ్‌-1, ఫేజ్‌-2 కాలనీల్లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి, నెలకొన్న సమస్యలపై ఆయన అధికారులతో చర్చించారు. కాలనీల్లో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించే బాధ్యత అధికారులదేనన్నారు. ముఖ్యంగా గచ్చిబౌలి డివిజన్‌లో శానిటేషన్ సమస్య రాకుండా చూడాలన్నారు. విద్యుత్ తీగలు సరిచేయడం, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచెలు వేయడం, అవసరమున్న చోట స్తంభాలు, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, ఇళ్లలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుడదన్నారు. కార్యక్రమంలో ఎలక్ట్రికల్ ఏఈ రాజశేఖర్, జలమండలి మేనేజర్ నరేందర్‌రెడ్డి, అభిషేక్‌రెడ్డి, ఎల్‌ఓ కృష్ణ, యూబీడీ మేనేజర్ యూసుఫ్, జీహెచ్‌ఎంసీ సిబ్బంది భరత్‌రెడ్డి, రఘు, రాజేష్,యాదవ్, అనీల్, కృష్ణ, శ్రీనివాస్, గోపాల్, ప్రసాద్, నాయకులు హన్మంతునాయక్, కిషన్, హరీష్‌శంకర్, తిరుపతి, రమేష్, ప్రభాకర్, శేఖర్ ,కాలనీ అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పథకాలు.. దేశానికి ఆదర్శం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం రామచంద్రాపురం పట్టణంలో షాదీముబారక్, కల్యాణలక్ష్మీ చెక్కుల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల కోసం సీఎం కేసీఆర్ పలు పథకాలను ప్రవేశపెట్టి అమలుచేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ జయరాం, తెల్లాపూర్ మున్సిపల్ వైస్‌చైర్మన్ రాములుగౌడ్, కార్పొరేటర్‌లు పుష్పనగేష్, సింధుఆదర్శ్‌రెడ్డి, కౌన్సిలర్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సచిన్ టెండూల్కర్ సందడి

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలో భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ సందడి చేశారు. ఐపీఎల్ మ్యాచ్‌లో భాగంగా హైదరాబాద్ సన్ రైజర్స్‌తో మంగళవారం తలపడనున్న నేపథ్యంలో ముంబై ఇండియన్స్ సభ్యులు సోమవారం రాత్రి శేరిలింగంపల్లిలో పర్యటించారు. ముంబై ఇండియన్స్ టీంలో హైదరాబాద్ ఆటగాడు తిలక్ వర్మ కుటుంబ సభ్యులను కలిసేందుకు సచిన్ టెండూల్కర్, తనయుడు అర్జున్ టెండూల్కర్‌తో పాటు టీం కెప్టెన్ రోహిత్ శర్మ, సభ్యులు భెల్ ఎంఐజీ కాలనీకి విచ్చేశారు. తిలక్ వర్మ తల్లిదండ్రులను నాగరాజు, గాయత్రి, కోచ్ సలాంలను సచిన్ టెండూల్కర్ అభినందించారు. తిలక్ వర్మ ప్రాక్టీస్ చేసిన లేగల స్పోర్ట్స్ అకాడమీని సందర్శించారు.



తిలక్‌వర్మ కుటుంబసభ్యులతో సచిన్ టెండూల్కర్, ఇతర క్రీడాకారులు

హెచ్‌సీయూ విద్యార్థికి అంతర్జాతీయ గుర్తింపు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్‌లోని పొలిటికల్ సైన్స్ విభాగం పరిశోధక విద్యార్థి కిరణ్‌కుమార్‌గౌడ్ గ్లోబల్ సౌత్ పాలసీ ప్రాసెస్ రీసెర్చ్ నెట్‌వర్క్ (జీఎస్‌పీపీఆర్‌ఎన్) స్టీరింగ్ కమిటీ సభ్యుడిగా ఎంపికయ్యాడు. ఫ్రాన్స్‌లోని ఇంటర్నేషనల్ పబ్లిక్ పాలసీ అసోసియేషన్ (ఐపీపీఏ) కింద ఈ నెట్‌వర్క్ పనిచేస్తుంది. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఆసియా, సౌత్‌ఆఫ్రికా, సౌత్ అమెరికా వంటి ప్రాంతాలలో పబ్లిక్ పాలసీ పనితీరు, అమలు చేస్తున్న విధానాలను పరిశోధనలు జరుగుతాయన్నారు.

ఇంటర్నెట్ సెంటర్‌పై ఎస్‌ఓటీ పోలీసుల దాడులు

పటాన్‌చెరు టౌన్: ఇంటర్నెట్ సెంటర్‌పై ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి, ఐపీఎల్ బెట్టింగ్ నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం..పటాన్‌చెరులోని ఓ ఇంటర్నెట్ సెంటర్‌లో ఐపీఎల్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు ఎస్‌ఓటీ పోలీసులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించారు. ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న నిర్వాహకుడు జ్ఞానేశ్వర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి రూ.లక్ష, ఒక సెల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కులసంఘాలకు సహకారం

పటాన్‌చెరు టౌన్: కుల సంఘాల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్నూరు కాపు సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రాజు, గౌరవ అధ్యక్షుడిగా ఎన్నికైన బుచ్చయ్యను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే



నృత్యం చేస్తున్న చిన్నారులు

రాయదుర్గం: ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను గౌరవించాలని పాఠశాల విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) విజయలక్ష్మి అన్నారు. రాయదుర్గంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో ప్రీ ప్రైమరీ గ్రాడ్యుయేషన్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగావిచ్చేసిన ఆమె తన చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. అంతకుముందు చిన్నారుల నృత్య ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం షేక్ తాజ్‌బాబా, పాఠశాల చైర్మన్ కృష్ణగౌడ్, కరస్పాండెంట్ భరత్‌కుమార్, ప్రిన్సిపల్ సుందరి, పూర్ణిమ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీలో అనారోగ్యంతో బాధపడుతున్న తస్లీమ్‌బేగంకు ఏకే ఫౌండేషన్ చైర్మన్ షేక్ అబ్దుల్ ఖదీర్ మంగళవారం రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు.

ఇన్ఫోస్ఫీ ఎదుట విద్యార్థుల ఆందోళన

గచ్చిబౌలి: గచ్చిబౌలిలోని ఇన్ఫోస్ఫీ డేటా సైన్స్ ట్రైనింగ్ సెంటర్ ఎదుట ఆ సంస్థలో శిక్షణ తీసుకున్న విద్యార్థులు మంగళవారం ఆందోళన చేపట్టారు. బ్యాంక్ లోన్ తీసుకొని డేటా సైన్స్‌లో శిక్షణ తీసుకునేందుకు 9 నెలల కోర్సులో చేరామని బాధితులు తెలిపారు. ఇంటర్న్‌షిప్ ఇవ్వకుండా కాలయాపన చేస్తూ తమను తొలగిస్తున్నామని మెయిల్ పంపడంతో ఏం చేయాలో అర్థం కాక ఆందోళనకు దిగినట్టు బాధితులు వాపోయారు.

అందరికీ సర్టిఫికెట్లు

డేటా సైన్స్ ట్రైనింగ్‌లో చేరిన వారు బ్యాంకు లోన్ ద్వారా ఫీజులు చెల్లించారు. బ్యాంక్ ఈఎంఐ కోసం ప్రతి నెల స్టైఫండ్ ఇస్తున్నట్టు ఇన్ఫోస్ఫీ ఫౌండర్ ప్రెసిడెంట్ డాక్టర్ దక్షిణామూర్తి తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ప్లేస్‌మెంట్ రాకపోవడంతో బ్యాంక్ లోన్‌ను తామే భరిస్తున్నామని, శిక్షణ తీసుకుంటున్న 700 మంది విద్యార్థులకు లోన్ ఉందని అందరికి బ్యాంక్‌లోన్ తీర్చినట్టు ఎన్‌ఓసీ ఇస్తామన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం కారణంగా ప్రాజెక్టులు రాకపోవడంతో ప్లేస్‌మెంట్ ఇవ్వలేని పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థులకు



డేటాసైన్స్ ట్రైనింగ్ సెంటర్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు డేటాసైన్స్ కోర్సు సర్టిఫికెట్, బ్యాంక్ లోన్‌ను తామే చెల్లిస్తామని విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఇప్పటికే 220 మందికి లోన్ చెల్లించామన్నారు. కాగా ఆందోళన విషయం తెలిసి రాయదుర్గం పోలీసులు సంస్థ వద్దకు వెళ్లి ఆరా తీశారు. విద్యార్థుల నుంచి ఎలాంటి ఫిర్యాదు రాలేదని సీఐ మహేష్ తెలిపారు.

అక్రమాలు తప్ప అభివృద్ధి శూన్యం



పాపిరెడ్డినగర్‌లో స్థానికులతో మాట్లాడుతున్న నాయకుడు యోగానంద్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: రాష్ట్రంలోనే అధిక పన్నులు కడుతున్న శేరిలింగంపల్లి నియోజకవర్గంలో సమస్యలు అధికంగా ఉన్నాయని నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు గజ్జెల యోగానంద్ అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి డివిజన్ పార్టు– 2లోని పాపిరెడ్డినగర్‌లో యోగానంద్ పాదయాత్ర చేశారు. స్థానికుల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో రోడ్లు, డ్రైనేజీ ,పెన్షన్లు, కుక్కల బెడద, వీధి దీపాల సమస్య, అంగన్‌వాడి కేంద్రాల లోటు, బస్తీ దవాఖానాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. అన్ని వసతులు వున్నా భివృద్ధికి నోచుకోలేదన్నారు. ఆస్‌బెస్టాస్ కాలనీలో లే అవుట్స్ వేసిన ఇళ్లకు రెగ్యులరైజ్ చేయకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని యోగానంద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లకు పలుమార్లు తెలియచేసినా సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని, కబ్జాలు తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమన్నారు.కార్యక్రమంలో నాయకులు భూపాల్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, మురళి, నర్సింగ్‌రావు, పర్వతాల యాదవ్, మహేష్ యాదవ్, ప్రభాకర్ యాదవ్, గోవర్ధన్ చారి, రాములు, శ్రీశైలం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌వీలో ‘పారా స్పోర్ట్స్’ సెలక్షన్స్

క్రీడా పోటీలను ప్రారంభించిన డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ



పోటీల ప్రారంభ వేడుకల్లో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ



పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

రాయదుర్గం: క్రీడాకారుల సందడితో గోపన్‌పల్లిలోని జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణం కళకళలాడింది. దేశంలోని జవహర్ నవోదయ విద్యాలయాల్లో చదివే దివ్యాంగ క్రీడాకారులంతా ఇక్కడ నిర్వహిస్తున్న దివ్యాంగ క్రీడాకారుల ‘పారా స్పోర్ట్స్ సెలక్షన్స్‌లో పాల్గొంటున్నారు. ఈ పోటీలను జవహర్ నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్, ఆదిత్య మెహతా ఫౌండేషన్ సహకారంతో నిర్వహిస్తున్నారు. జేఎన్‌వి ప్రిన్సిపల్ డానియల్ రత్నకుమార్ ఆధ్వర్యంలో సాగే ఈ పోటీలను నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ కమిషనర్ గోపాలకృష్ణ చేతుల మీదుగా మంగళవారం ప్రారంభించారు.

వారం రోజులూ సందడే..

ఈ క్రీడా పోటీలలో వరంగల్, గుంటూరు, బెంగళూరు, దార్వాడ్, యాదగిరి, తివేంద్రం, త్రిసూర్, వైజాగ్, విజయవాడ, హైదరాబాద్, సికింద్రాబాద్ క్లస్టర్‌కు చెందిన 150 మంది బాలురు, 80 మంది బాలికలు పాల్గొంటున్నారు.స్విమ్మింగ్, సైక్లింగ్, పవర్ లిఫ్టింగ్, అథ్లెటిక్స్, తైక్వాండో పోటీలు నిర్వహిస్తారు. పోటీలో పాల్గొనేందుకు వచ్చిన విద్యార్థులకు త్రీవీలర్స్‌ను గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డానియల్ రత్నకుమార్ పర్యవేక్షణలో అందించారు.

తుక్కు గోదాంలో అగ్ని ప్రమాదం



దట్టమైన పొగ వెలువడుతున్న దృశ్యం

పటాన్‌చెరు టౌన్: తుక్కు గోదాంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ జన్యానాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తంగి పరిధిలోని తుక్కు గోదాంలో మంగళవారం అకస్మాత్తుగా మంటలు రేగాయి. దీన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది 20 నిమిషాల్లో మంటలార్పారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు అక్కడ ఎవరూ లేరని, తుక్కు తగలబడిందన్నారు.

బొల్లారంలో నటి కీర్తిసురేష్ సందడి

జిన్నారం(పటాన్‌చెరు): నటి కీర్తి సురేష్ బొల్లారంలో మంగళవారం సందడి చేశారు. పారిశ్రామికవాడలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన ఆమెను చూసేందుకు ప్రజలు, అభిమానులు బారులు తీరారు. సెల్ఫీలు తీసుకునేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా నటి కీర్తిసురేష్ మాట్లాడుతూ యువత పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సంయుక్త ఇంటీరియల్ డెవలపర్స్ సంస్థ ప్రతినిధి సంయుక్త, కౌన్సిలర్ చంద్రారెడ్డి నాయకులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కీర్తి సురేష్

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తెలిపారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ కాలనీలో రూ.25 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలో ఇప్పటికే రూ.5కోట్ల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల పనులు చేపట్టామన్నారు. రోడ్లతో పాటు యూజీడీలు, మిషన్ భగీరథ, పరిశుభ్రత పచ్చదనం పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ బాలయ్య, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షులు అఫ్జల్ పాల్గొన్నారు.



పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి